
# గోల్డ్ @ 85,300

## దేశీయంగా ఆల్‌టైమ్ హైకి బంగారం ధర

## మరో రూ.400 పెరిగిన తులం రేటు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: బంగారం ధరలు మళ్లీ పరుగులు తీస్తున్నాయి. ఆ మధ్య విరామం ఇచ్చిన రేట్లు.. తిరిగి పెరుగుతూపోతున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం ఆల్‌టైమ్ హై రికార్డును నెలకొల్పాయి. మునుపెన్నడూ లేనివిధంగా దేశీయ మార్కెట్‌లో తులం ధర ఏకంగా రూ.85వేల మార్కును దాటేసింది. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల విలువ రూ.85,300 పలికింది మరి. ఒక్కరోజే రూ.400 ఎగిసినట్టు అఖిల భారత సరఫా సంఘం తెలియజేసింది.

**ఇదీ సంగతి..**

పుత్తడి ధరలు ఈ స్థాయిలో రికార్డులకెక్కడం వెనుక.. నగల వ్యాపారులు, స్టాక్‌హోల్డర్ల నుంచి పెరిగిన డిమాండ్, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం, అంతర్జాతీయ మార్కెట్ల ట్రెండే ప్రధాన కారణాలని ట్రేడర్లు విశ్లేషిస్తున్నారు. ఇకపోతే స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కదలాడుతుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపునకు మళ్లిస్తున్నారని, అందుకే ఈ ధరల పెరుగుదల అంటూ తాజా మార్కెట్ సరళిని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముమ్మందూ పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అంచనాల మధ్య ధరలు కొత్త రికార్డుల్నే సృష్టించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

**హైదరాబాద్‌లో..**

హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికొస్తే.. 24 క్యారెట్ తులం విలువ రూ.84,050గా ఉన్నది. గతంతో పోల్చితే రూ.440 తగ్గడం గమనార్హం. ఇక 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత లేదా ఆభరణాల బంగారం) 10 గ్రాముల రేటు రూ.77,050గా ఉన్నది. రూ.400 పడిపోయింది. ఇదిలావుంటే ఢిల్లీలో వెండి ధర కిలో రూ.300 పెరిగి రూ.96,000గా ఉన్నది. వరుసగా ఐదోరోజూ ధరలు పెరగడం విశేషం. అయితే ధరలు పెరుగుతూపోతే మార్కెట్‌లో స్తబ్ధత నెలకొంటుందని, కస్టమర్లు వేచిచూసే ధోరణిని అవలంబిస్తారని ఆభరణాల వర్తకులు వాపోతున్నారు. దీనివల్ల వ్యాపారం దెబ్బతింటుందని చెప్తున్నారు. నిజానికి ధరలు స్థిరంగా ఉన్నప్పుడే కొనుగోళ్లు బాగా జరుగుతాయని వారు అంటున్నారు.

**గ్లోబల్ మార్కెట్‌లో..**

అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 2,827.50 డాలర్లుగా నమోదైంది. క్రితంతో పోల్చితే 7.50 డాలర్లు పెరిగింది. ఔన్స్ సిల్వర్ 32.10 డాలర్లు పలికింది. ఇక భారతీయ ఫ్యూచర్ మార్కెట్లలో బంగారం ఏప్రిల్ నెల కాంట్రాక్టులకుగాను తులం రూ.82,765గా ట్రేడ్ అయ్యింది. మార్చి నెలకుగాను వెండి కిలో రూ.93,650గా ఉన్నది.

### ఏఐ వర్సిటీతో పెరగనున్న రాష్ట్ర ప్రతిష్ఠ

**మంత్రి శ్రీధర్‌బాబు**



హైదరాబాద్, ఫిబ్రవరి 3(నమస్తేతెలంగాణ): ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుతో రాష్ట్ర ప్రతిష్ఠ మరింత పెరగనున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో డిపాజిటరీ ట్రస్ట్ క్లియరింగ్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..ఎమర్జింగ్ టెక్నాలజీలో పెట్టుబడులు పెట్టాలనుకొనే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, రాబోయే రోజుల్లో ఏఐ అంటే తెలంగాణ, హైదరాబాద్ గుర్తుకువచ్చేలా యూనివర్సిటీని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

# రూపీ మహా పతనం


## మార్కెట్‌లో వాణిజ్య యుద్ధం భయాలు • ఆల్‌టైమ్ కనిష్ఠానికి మారకం విలువ

### తొలిసారి 87 మార్కు దిగువకు క్షీణత • మరో 49 పైసలు దిగజారి 87.11 వద్దకు

ముంబై, ఫిబ్రవరి 3: డాలర్ ముందు రూపాయి తేలిపోతున్నది.. ఏమాత్రం నిలువలేక చతికిలపడుతున్నది.. అంతకంతకూ బలహీనపడిపోతున్నది. గతకొద్ది రోజులుగా ఫారెక్స్ మార్కెట్‌లో భారతీయ కరెన్సీ ట్రేడింగ్ తీరుతెన్నులను వివరించే క్రమంలో వాడుతున్న వాక్య నిర్మాణాలివి. అవును.. రూపీ కష్టాలు అన్నీ ఇన్నీ కావు మరి. అయితే వరుస పతనాల్లో కొట్టుమిట్టాడుతున్న రూపాయికి.. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రూపంలో కొత్త సమస్యలు వచ్చినట్టే కనిపిస్తున్నది. ఇవి ఇలాగే సాగితే రూపీ సెంచరీ కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. సోమవారం మరో 49 పైసలు దిగజారి డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ తొలిసారి 87 మార్కును దాటేసింది. మునుపెన్నడూ లేనివిధంగా 87.11 వద్ద ముగిసి మరో ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేసింది. కెనడా, మెక్సికో, చైనాలపై ట్రంప్ సర్కారు విధించిన సుంకాలే దీనికి ప్రధాన కారణం.

**ట్రంప్ దెబ్బ**

కెనడా, మెక్సికోలపై 25 శాతం చొప్పున సుంకాలు బాదిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. చైనాపై 10 శాతం విధించారు. ఈ నిర్ణయం అమెరికా డాలర్ ఇండెక్స్‌ను ఒక్కసారిగా ఎగదోసింది. 109 స్థాయి ఎగువకు డాలర్ సూచీ వెళ్లింది. ఈ దెబ్బకు రూపాయి కూడా ఒకానొక దశలో 67 పైసలు క్షీణించి 87.29 స్థాయికి పడిపోవడం గమనార్హం. తిరిగి మళ్లీ కోలుకున్నా.. నష్ట తీవ్రత మాత్రం పెద్దగానే జరిగింది. ఆయా దేశాలపై సుంకాలు వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చన్న భయాలు ఫారెక్స్ మార్కెట్‌ను చుట్టుముట్టాయి. దీంతో దేశీయ దిగుమతిదారులు డాలర్ కొనుగోళ్లకు పెద్దపీట వేశారని ట్రేడర్లు చెప్తున్నారు. ఇక విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) తమ పెట్టుబడులను భారత మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకుంటుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను మరింతగా బలహీనపరుస్తున్నది. మరో రూ.3,958.37 కోట్లు ఉపసంహరించుకున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలూ రూపీ ఉసురుతీశాయి.



**భయపడొద్దు.. ఆర్బీఐ ఉందిలే: పాండే**


రూపాయి రికార్డు నష్టం నేపథ్యంలో విలేకరుల వద్ద కేంద్ర ఆర్థిక కార్యదర్శి తుహిన్ కాంత పాండే స్పందిస్తూ.. 'భయం అక్కర్లేదు ఈ ఒడిదొడుకులను ఆర్బీఐ చూసుకుంటుందిలే' అన్నారు. అలాగే భారతీయ కరెన్సీ స్వేచ్ఛగా ట్రేడ్ అవుతుందని, దాన్ని అదుపు చేయడం లేదా ఒక స్థిరమైన రేటును నిర్ణయించడం అనేది ఉండబోవని కూడా చెప్పారు. దేశీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడుల నడుమ రూపాయి మారకం విలువ ఒత్తిళ్లకు గురవుతుందన్న ఆయన.. ఈ ఒడిదొడుకులను ఆర్బీఐ సరిచేస్తుందన్న ధీమాను కనబర్చారు. ఇక డిసెంబర్ 31న 85.61 వద్ద ముగిసిన రూపీ విలువ.. ఇప్పుడు 87.11 వద్దకు చేరింది. కేవలం గడిచిన నెల రోజుల్లోనే రూపాయిన్నర క్షీణించింది.

# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ముంబై, ఫిబ్రవరి 3: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్ యుద్ధానికి తెరలేపడంతో అంతర్జాతీయ మార్కెట్లు ఒక్కసారిగా కుదుపునకు లోనయ్యాయి. దీంతో వరుసగా ఐదు రోజులుగా లాభపడుతున్న సూచీలు భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 319.22 పాయింట్ల నష్టంతో 77,186.74 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 121.10 పాయింట్లు కోల్పోయి 23,361.05 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.4,29,823.69 కోట్లు కోల్పోయి రూ.4,19,54,829.60 కోట్లు(4.82 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. ఎల్అండ్‌టీ, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, పవర్‌గ్రిడ్, ఎన్టీపీసీ, రిలయన్స్ షేర్లు అత్యధికంగా నష్టపోగా..బజాజ్ ఫైనాన్స్ 5 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి షేర్లు కూడా లాభాల్లో ముగిశాయి.

# ఈసారి వడ్డీరేట్లు తగ్గుతాయ్!

## రెపో రేటు పావు శాతం దిగిరావచ్చు • ఆర్బీఐ ద్రవ్యసమీక్షపై నిపుణుల అంచనా



ముంబై, ఫిబ్రవరి 3: త్వరలో వడ్డీరేట్లు పావు శాతం తగ్గుతాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష బుధవారం మొదలు కానుండగా.. శుక్రవారం ఫలితం తేలనున్నది. ఈ క్రమంలోనే రెపో రేటును ఈసారి ఆర్బీఐ 25 బేసిస్ పాయింట్లు తగ్గించే వీలున్నదని ఆర్థిక, బ్యాంకింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి బడ్జెట్ నిర్ణయాలకు ఊతమివ్వడంలో భాగంగా రెండేండ్ల తర్వాత రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతకు దిగవచ్చన్న విశ్లేషణలు వస్తున్నాయి మరి.

**బడ్జెట్‌కు ఊతం..**

వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025–26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కొత్త ఆదాయ పన్ను (ఐటీ) విధానం కింద రూ.12 లక్షలదాకా వార్షిక ఆదాయం ఉన్నవారు ఎలాంటి పన్నులు చెల్లించనవసరం లేదని పేర్కొన్న సంగతీ విదితమే. స్టాండర్డ్ డిడక్షన్ రూ.75వేలతో కలిపి రూ.12.75 లక్షలదాకా ఐటీ మినహాయింపు లభిస్తున్నది. మార్కెట్‌లో తగ్గిన కొనుగోలు, వినిమయ శక్తిని పెంచేందుకు తమ నిర్ణయం కలిసొస్తుందన్న ఆశాభావాన్నీ మంత్రి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఈసారి ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ కూడా తన వంతుగా కీలక వడ్డీరేట్లను పావు శాతం మేర తగ్గించవచ్చని మెజారిటీ నిపుణులు అంటున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు కనిష్ఠాలకు పడిపోతున్న వేళ, దేశ జీడీపీ వృద్ధిరేటు మందగమనం దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో వడ్డీరేట్ల తగ్గింపు మేలు చేయగలదన్న విశ్వాసాన్ని వారు కనబరుస్తున్నారు.

**రెండేండ్ల తర్వాత..**

2023 ఫిబ్రవరిలో రెపో రేటును 6.5 శాతానికి పెంచిన ఆర్బీఐ.. మళ్లీ ఆ తర్వాత దాని జోలికి వెళ్లనే లేదు. ద్రవ్యోల్బణం కట్టడి లక్ష్యంలో భాగంగా వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లోనే కొనసాగిస్తున్నది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై అధిక వడ్డీరేట్లనే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు అనుసరిస్తున్నాయి. ఫలితంగా ఆయా రుణగ్రహీతలు, వివిధ వ్యాపార రంగాలు ప్రభావితమవుతున్నాయి. ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తే రియల్టీ, ఆటోతోపాటు పలు రంగాల్లో తిరిగి అమ్మకాలు పుంజుకుంటాయని వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఆశిస్తున్నాయి. నిజానికి కరోనాతో దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో ఉత్తేజం నింపేందుకు ఆర్బీఐ వడ్డీరేట్లను భారీగా తగ్గించింది. అయితే ఆ తర్వాత విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయాలని వరుసగా పెంచుకుంటూపోయింది. ఈ క్రమంలో గత ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ తన ద్రవ్యవైఖరిని మార్చుకున్నది. రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయని అప్పటి ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సంకేతాలు కూడా ఇచ్చారు. మరి కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఏం నిర్ణయం తీసుకుంటారో చూడాలి. మల్హోత్రా నాయకత్వంలో ఇదే తొలి ఆర్బీఐ ద్రవ్యసమీక్ష కావడం గమనార్హం.



# గెలాక్సీ ఎస్25 అమ్మకాలు షురూ

హైదరాబాద్, ఫిబ్రవరి 3: సామ్‌సంగ్ ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన ఎస్25 ఫోన్ల విక్రయాలను రాష్ట్రంలో ప్రారంభించింది. హైదరాబాద్‌లోని మాస్టర్ టెలికమ్యూనికేషన్స్ స్టోర్‌లో ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి అందచేశారు. ఈ కార్యక్రమంలో సామ్‌సంగ్ ప్రతినిధులు ఎస్కే నాగుర్‌మౌలా, రాజశేఖర్, సుధీర్ కుమార్‌తోపాటు మాస్టర్ టెలికమ్యూనికేషన్స్ యజమాని సమీర్ మహ్మద్ కలిసి కస్టమర్‌కు తొలి ఫోన్లను అందచేశారు. మూడు రకాల్లో లభించనున్న ఈ ఫోన్ రూ.80,999 నుంచి రూ.1.29 లక్షల ధరల శ్రేణిలో లభించనున్నాయి. వీటిలో ఎస్25 బేసిక్ మాడల్ 12జీబీ+128 జీబీ, 12జీబీ+256జీబీ, 12జీబీ+512జీబీ ప్రారంభ ధర రూ.80,999గాను, ఎస్25+ మాడల్ ప్రారంభ ధర రూ.99,999, అలాగే ఎస్25 అల్ట్రా మాడల్ 12జీబీ+256 జీబీ, 12జీబీ+51జీబీ, 12జీబీ+1టీబీ మాడల్ ధర రూ.1,29,999కి విక్రయించనున్నది.

# గ్లాండ్‌ఫార్మా లాభం 205 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 3: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా దిగ్గజం గ్లాండ్ ఫార్మా ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.205 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.192 కోట్ల కంటే ఇది 7 శాతం అధికమని పేర్కొంది. కంపెనీ ఆదాయం రూ.1,384 కోట్ల నుంచి రూ.1,545 కోట్లకు ఎగబాకింది.

## అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు నిర్మల్ క్రీడాకారులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 3 : ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు ఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించే నాల్గొవ అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు నిర్మల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని కిక్ బాక్సింగ్ సెక్రటరీ స్వామి, అధ్యక్షుడు శేఖర్ తెలిపారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన వీరిని జిల్లా యువజన క్రీడల శాఖాధికారి శ్రీకాంత్ రెడ్డి, బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ, పేటా అధ్యక్షుడు భోజన్న, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్ తదితరులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థినులు

## ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



సాక్షులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎస్పీ

బోథ్, ఫిబ్రవరి 3 : మండలంలోని సొనాల గ్రామానికి చెందిన గుడాల అనీష్ తనను కులం పేరుతో దూషించారని బత్తుల రమేశ్ ఫిర్యాదు మేరకు సోమవారం ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి విచారణ చేశారు. జనవరి 30న తనను కులం పేరుతో దూషించారని రమేశ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు డీఎస్పీ సొనాల గ్రామానికి వచ్చి ప్రత్యక్ష సాక్షులను విచారించారు. వివరాలు తెలుసుకొని నమోదు చేశారు. డీఎస్పీ వెంట సీఐ వెంకటేశ్వర్‌రావ్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

## మహారాష్ట్ర మద్యం పట్టివేత

కుభీర్, జనవరి 3 : మండలంలోని సరిహద్దు గ్రామమైన సిర్పెల్లి(హెచ్) వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా (ఎంహెచ్20 సీఎస్ 7241)కారులో అక్రమంగా తరలిస్తున్న మహారాష్ట్ర మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారని ఎస్ఐ రవీందర్ తెలిపారు. మహారాష్ట్రలోని భోఖర్ పట్టణం నుంచి కుభీర్‌కు తరలిస్తున్న టవేరా వాహనంలో 17.64 లీటర్ల మద్యం దొరికింది. సుమారు రూ.20వేల విలువ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



పట్టుకున్న మహారాష్ట్రం మద్యాన్ని చూపుతున్న ఎస్ఐ రవీందర్

## అనుమానిత వేటగాళ్ల పట్టివేత

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 3: కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో అనుమానిత వేటగాళ్లను సోమవారం అటవీ శాఖ అధికారులు అదుపులో తీసుకున్నారు. జైపూర్ నుంచి చెన్నై వెళ్లే రైలులో వేటగాళ్లు ప్రయాణిస్తున్నారని అందిన సమాచారం మేరకు అధికారులు సోదాలు నిర్వహించారు. కొందరి వద్ద ఉన్న మూటలను పరిశీలించగా అందులో వేటకు ఉపయోగించే పరికరాలు లభించడంతో అటవీ శాఖ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని నాగపూర్ అటవీ ప్రాంతంలో అడవి జంతువులను వేటాడి అక్కడి నుంచి బయలుదేరడంతో పోలీసులు, ఆరీఫ్, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా సోదాలు నిర్వహించి వారిని అదుపులో తీసుకున్నారు.

# ఎన్నికల హామీలను నెరవేర్చాలి

- దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు జక్కుల నారాయణ


నేరడిగొండ, ఫిబ్రవరి 3 : కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు జక్కుల నారాయణ అన్నారు. సోమవారం నేరడిగొండ తహసీల్దార్ కలీంకు మండల దివ్యాంగులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఇప్పటి వరకు దివ్యాంగులకు ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. దివ్యాంగులందరికీ ఇండ్లు, ప్రత్యేక రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు బ్యాక్‌లాగ్ పోస్టుల నోటిఫికేషన్ రాలేదన్నారు. సంఘ భవనం కేటాయించాలన్నారు. అనంతరం దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని నేరడిగొండ ఏఎస్ఐకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అయ్యన్నగారి పోశెట్టి, కార్యదర్శి రాథోడ్ గణేశ్, సభ్యులు తోట చిన్న పోశెట్టి, కత్తుల పురం నారాయణ, శంకర్, సత్యనారాయణ, చిన్నయ్య, నర్సరెడ్డి, సలీం, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న దివ్యాంగులు

## రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దొంగతనం

సారంగాపూర్, ఫిబ్రవరి 3: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ శివారులో గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి దొంగతనం జరిగినట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాత్రి గుర్తుతెలియని దొంగలు ఆలయం తలుపులు పగులగొట్టి అమ్మవారి బంగారు పుస్తెలతాడు సుమారు మూడుగ్రాములు, వెండి వడ్డాణం సుమారు 15 గ్రాముల ఆభరణాలు దొంగిలించారు. అలాగే హుండీ తాళం పగులగొట్టి నగదును దొంగిలించి ఎత్తుకెళ్లారు. కాగా సోమవారం డ్యాగ్‌స్కాడ్ సహాయంతో తనిఖీ లు చేశారు. గ్రామానికి చెందిన సంజీవ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



డాగ్‌స్కాడ్ సహాయంతో ఆలయంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

## ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడిగా చింతావార్ రాజు

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 3: ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడిగా తాడిహత్నూర్‌కు చెందిన చింతావార్ రాజు నియమితులయ్యారు. సోమవారం మండలంలోని లక్కారం గ్రామంలోని ఆర్య వైశ్య భవన్‌లో ఆయకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయను సంఘ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ సంఘ సభ్యులు రామిని నాగన్న, సాయిని పోశన్న, లక్కాకు భూపతి తదితరులున్నారు.

### 'వెయ్యి గొంతుకలు, లక్ష డప్పులు'

## విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

బేల/గుడిహత్నూర్, ఫిబ్రవరి 3 : ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతుకలు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బేల మండలాధ్యక్షుడు కృష్ణపెళ్లి అంకుశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగల బల ప్రదర్శన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి మండల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మాదిగలు, ఉపకులాలు తరలిరావాలని కోరారు. ఇక్కడ సునీల్, పసుల శ్రీనివాస్, బుడగ జంగం ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, శ్రీకాంత్, ప్రశాంత్ అనిల్, అంకుష్, తదితరులున్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలో లక్ష డప్పుల వెయ్యి గొంతుల కార్యక్రమ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నాయకులు పోస్టర్లను విడుదల చేశారు. ఇక్కడ బడుగు గంగయ్య, నాయకులు రామంచల లక్ష్మణ్, కొల్లూరి వినోద్, మల్యాల కరుణాకర్, దోమకొండ సుధాకర్, సుంకె రమేశ్, నక్క భూమన్న, రాజేశ్వర్,ప్రవీణ్, తదితరులున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జన్నారం, ఫిబ్రవరి 3 :మండలంలోని కలమడుగు గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద అదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల జిల్లా కమ్మునూర్ గ్రామానికి చెందిన రాయవేణి రాజశేఖర్(32)మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ రాజవర్ధన్ సోమవారం తెలిపారు.పోలీసుల కథనం మేరకు వివరా ఇలా ఉన్నాయి. అల్లంల రవికుమార్ బైక్‌పై రాజశేఖర్‌తో కలిసి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి సిమెంట్ కుర్చీని ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో ధర్మపురి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి రాజశేఖర్ మృతి చెందాడని తెలిపారు. రవికుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. మృతుడి భార్య భాషవేణి అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు.

## సంచార చేపల విక్రయ వాహనం ప్రారంభం



వాహనంను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం,ఫిబ్రవరి 3: ఇందిరా మహిళా శక్తి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మంజూరైన సంచార చేపల విక్రయ వాహనాన్ని సోమవారం కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి పథకం కింద రూ.10 లక్షలతో సంచార చేపల అమ్మకం వాహనం సరస్వతీ మండలం స్వయం సహాయక సంఘ సభ్యురాలు తాప్రె సునీతకు మంజూరు చేశామన్నారు. ఇందులో రూ.4 లక్షలు సభ్యురాలు వాటా కాగా, రూ.6 లక్షలు సబ్సిడీ మంజూరైందని తెలిపారు. జైనథ్‌లో దొరికే చేపలతో మంచి ప్రొడక్ట్ తయారు చేసి లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో రవీందర్ రాథోడ్, జిల్లా మత్స్య శాఖాధికారి, మండల సమైఖ్య సభ్యులు, ఏపీఎం, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, జనవరి 3: గిరిజనుల అభివృద్ధికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. సోమవారం ఐటీడీఏ పీవో క్యాంప్ కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన గ్రామాల అభివృద్ధితోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లా సిర్పూర్ మండలం కొమ్ముగూడెం చెందిన మారు తనకు లోన్ ఇప్పించాలని, బోథ్ మండలం కోటపల్లి గ్రామానికి చెందిన సోమన్న తనకి బోరు బావి మంజూర్ చేయాలని, రాగాపూర్ గ్రామానికి చెందిన కోవశంభు తనకి కిరాణం కోసం లోన్ కావాలని, అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు పలు పథకాలు, రెవెన్యూ సమస్యలు, ఫారెస్ట్ సమస్యలు, ఇండ్లు కావాలని అర్జీలు పెట్టుకున్నారు. వాటిని పరిశీలించి సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. ఈ దర్బార్‌లో ఏపీవో వసంత్‌రావు, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి మనోహర్, జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

దండేపల్లి, ఫిబ్రవరి3 : దండేపల్లి మండలంలోని తాళ్లపేట రేంజ్ పరిధిలోని ఊట్ల గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కలప దుంగలను పట్టుకున్నట్లు తాళ్లపేట రేంజర్ సుష్మారావు తెలిపారు. ద్విచక్ర వాహనంపై కలప తరలిస్తున్నారనే సమాచారం మేరకు అటవీ అధికారులు వెంబడించగా 9 దుంగలు, ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి నిందితుడు పారిపోయాడన్నారు. పట్టుకున్న కలప విలువ రూ.33,321 ఉంటుందని రేంజర్ తెలిపారు. ఈ దాడిలో ఎఫ్‌బీవో సాయి, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.